## క్లుప్తంగా...

### వారాంతపు సంతల సమాచారం

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో కూరగాయాలు, ఇతర సామాగ్రి విక్రయించే వారాంతపు సంతల సమాచారం..
సోమవారం – రైల్వే స్టేషన్ రోడ్డు(పోలీస్ క్వార్టర్స్ రోడ్డు), అత్వెల్లి,
మంగళవారం – ఉమానగర్, కేఎల్ఆర్ విజయానగర్
బుధవారం – ఎన్‌జీఓస్ కాలనీ(మేడ్చల్),
గురువారం – వీకర్ సెక్షన్ కాలనీ (జెడ్పీహెచ్ఎస్ స్కూల్ వద్ద),
శుక్రవారం –సూర్యనగర్, చంద్రానగర్,
శనివారం –హౌసింగ్ బోర్డ్ కాలనీ, కిష్టాపూర్, చెక్‌పోస్టు, ఆర్టీసీ కాలనీ
ఆదివారం – ప్రధాన మార్కెట్.

### నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంఎస్ఆర్ గార్డెన్ నిర్వహించే సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

### వివాహానికి పుస్తె మెట్టెలు, వస్త్రాలు అందజేత


పుస్తె మెట్టెలు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, నాగరాణి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ సంతోష్‌నగర్‌కు చెందిన రమాదేవి కుమార్తె సౌమ్య వివాహానికి పుస్తె మెట్టెలు, నూతన వస్త్రాలను మంగళవారం డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, ఆయన సతీమణి నాగరాణి దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవారికి సాయం అందిస్తేనే నిజమైన ఆనందం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రజిత, భారతి తదితరులు పాల్గొన్నారు.

### టీఎన్‌జీవో నూతన అధ్యక్ష కార్యదర్శులకు అభినందనలు



జవహర్‌నగర్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ (టీఎన్‌జీవో) రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన రాజేందర్, సెక్రటరీగా ఎన్నికైన జగదీష్‌ను మంగళవారం తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రభాకర్ ఆధ్వర్యంలో వారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై వారు చర్చించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, రమేష్, వెంకట్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలంతా బస్తీదవాఖానా సేవలను సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్‌పరిధిలోని రాంపల్లి బస్తీ దవాఖానాలో డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ కప్పల రేష్మ, వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### తడి-పొడి చెత్తపై అవగాహన

మేడ్చల్‌రూరల్: మండలంలోని మునీరాబాద్, రాజబొల్లారం తండా గ్రామాల్లో మంగళవారం గ్రామస్తులకు తడిపొడి చెత్త వేరు చేయు విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు చిట్టిమిల్ల గణేశ్, మంగ్యానాయక్‌లు గ్రామ కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులతో కలిసి ఇంటింటికీ వెళ్లి తడి–పొడి చెత్త వేరు చేసే విధానం, మరుగుదొడ్ల వాడకంపై మహిళలకు వివరించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జలమా..గరళమా..?



- పూృరిఫైర్ వాటర్ మాటున గరళం
- నిబంధనలు పాటించకుండానే నీటి వ్యాపారం
- ఐఎస్‌ఐ మార్కు, లైసెన్సు లేకుండానే ప్లాంట్లు
- పట్టించుకోని అధికారులు.. రోగాల బారిన ప్రజలు
- ఇప్పటికైనా స్పందించాలంటున్న ప్రజలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: వేసవి నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతుండగా ఇదే అదనుగా ప్యూరిఫై వాటర్ పేరుతో కొందరు నీటి వ్యాపారం చేస్తున్నారు. విచ్చలవిడిగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్లాంట్లు ఏర్పాటైనా ఒక్కచోటా కనీస నిబంధనలు పాటించడం లేదు. జిల్లాలో 600లకు పైగా ప్యూరిఫై(శుద్ధి) ప్లాంట్లు ఉండగా, ఇందులో అన్ని అనుమతులతో కొనసాగుతున్న ప్లాంట్లు దాదాపు 200 వరకు ఉన్నట్లు భూగర్భ జలవనరుల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే నీటిని నిబంధనలకు అనుగుణంగా ప్యూరిఫై(శుద్ధి) చేయకుండానే విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

#### పెరిగిన నీటి వ్యాపారం

జిల్లాల విభజన జరగకముందు వేళ్ల మీద లెక్క పెట్టే సంఖ్యలో ఉండే ప్యూరిఫై ప్లాంట్లు నేడు పురపాలక సంఘాలతో సహా గ్రామ పంచాయతీలు, జీహెచ్ఎంసీ పరిధిలోని డివిజన్లలోని ప్రధాన కూడళ్లలో ప్రతిచోటా వెలిశాయి. వేసవికాలం, పెళ్లిళ్ల ఇతర శుభ కార్యాలయాలు, హోటళ్లు, బార్లు, వైన్ షాపులు, ఇతర వ్యాపార సముదాయాలను కలుపుకుంటే వేల సంఖ్యలో క్యాన్ల విక్రయాలు జరుగుతున్నాయి. ప్లాంటు దగ్గరికే వెళ్లి తీసుకుంటే ఒక్కో క్యానుకు రూ.10 తీసుకుంటున్నారు.

#### నియంత్రణ లేకపోవడంతో..

మిషన్ భగీరథ పథకం రానప్పుడు ఎక్కడైతే తాగడానికి పనికిరాని నీరుందని సమాచారం వస్తే అక్కడ నీటి పరీక్ష జరిపి ఆర్వో ప్లాంట్లకు అనుమతి ఇచ్చేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితితోపాటు నియంత్రణ లేకపోవటంతో.. ఇదే అదనుగా భావిస్తున్న వ్యాపారులు ఇష్టం వచ్చిన రీతిలో ప్లాంట్లను విస్తరిస్తున్నారు. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న ప్యూరిఫై వాటర్ ప్లాంట్ల నియంత్రణపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

#### నిబంధనలు ఇవీ..

వాటర్ ప్లాంటు ఏర్పాటుకు బీఎస్‌ఐ అనుమతి ఉండాలి. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలి. ప్లాంటులో విశాలమైన హాలు ఉండాలి. వెలుతురు, గాలి ఉండాలి. టైల్స్, గ్రానైట్ గచ్చు ఉండాలి. స్టీల్, హెచ్‌డీపీ పైపు లైన్లు ఏర్పాటు చేసుకోవాలి. ఐఎస్‌ఐ మార్కు కలిగిన ఫిల్టర్ యంత్రాలు వాడాలి. నీటిట్యాంకులు, ఇతర సామగ్రి, నాణ్యమైనవి వాడాలి. పురపాలక సంఘం లేదా గ్రామ పంచాయతీ నుంచి ట్రేడ్ లైసెన్సు పొందాల్సి ఉంటుంది.

# పేదల సంక్షేమానికి పెద్దపీట


ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

మంత్రి మల్లారెడ్డి

కీసర: రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన దమ్మాయిగూడ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అభివృద్ధి–సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. పేదల కోసం సీఎం కేసీఆర్ ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, రైతు బీమా, రైతుబంధు, ఉచిత కరెంటు, దళితబంధు పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలంటే కేంద్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో దేశంలోని ఇతర రాష్ట్రాల్లో బీఆర్ఎస్ సభలను నిర్వహిస్తే అక్కడి ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన లభిస్తోందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు తమకు కూడా అందజేయాలని ప్రజలు కోరుతున్నారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశంలోని 19 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ ఎందుకు అమలు చేయడం లేదని విమర్శించారు.

#### పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు..

రాష్ట్రం ఏర్పడిన తర్వాత శివారు ప్రాంతాల్లో ఉన్న మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని సమస్యలను గత ప్రభుత్వాలు పరిష్కరించలేదన్నారు. గత ప్రభుత్వాలు ఇక్కడ చెత్తడంపింగ్ యార్డును ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తోందని అన్నారు. ఇక్కడ మురుగునీటిని శుద్ధి చేసేందుకు ప్లాంట్‌తోపాటు చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంటును కేటీఆర్ ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు వివరించారు. సమావేశంలో బీఆర్ఎస్ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కౌకుట్ల తిరుపతి రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## అవుషాపూర్‌లో స్వచ్ఛ్ సర్వేక్షణ్ ర్యాలీ


అవుషాపూర్‌లో స్వచ్ఛ్ సర్వేక్షణ్ ర్యాలీలో సర్పంచ్ కావేరి, ఎంపీడీఓ అరుణ

ఘట్‌కేసర్: అవుషాపూర్ గ్రామంలో సర్పంచ్ కావేరి ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛ్ సర్వేక్షణ్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ అరుణరెడ్డి హాజరై పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛ్ సర్వేక్షణ్ సభ్యులతో పారిశుద్ధ్య కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై చెత్త వేయకుండా పంచాయతీ నుంచి చెత్త సేకరించే వాహనంలోనే వేయాలని, తడి పొడి చెత్తను వేర్వేరు బుట్టలో వేయాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, వీరేశ్, నాయకుడు మశ్చేందర్‌రెడ్డి, ఏపీఎం తార్యనాయక్, ఆత్మారాం, జయశ్రీ, శ్రవణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు కవిత, సునీత పాల్గొన్నారు.

## ప్రతి పౌరుడికి రాజ్యాంగాన్ని ఉచితంగా ఇవ్వాలి


కాప్రా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

జవహర్‌నగర్: దేశంలో, రాష్ట్రంలో ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగాన్ని ఉచితంగా ఇవ్వాలని ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారాధన్ మహరాజ్ ఆదేశాల మేరకు కాప్రా మండల కో–ఆర్డినేటర్ శ్రీధర్ మహరాజ్ ఆధ్వర్యంలో కాప్రా మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా రాజ్యాంగంలోని మౌళిక అంశాలపై, చట్టాలపై ప్రభుత్వాలు అవగాహన కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. నాయకులు శ్రీనివాస్, రవి, యాదగిరి, రమేష్, కుమార్, ఉపేందర్, శ్రీనివాస్, ధర్మేష్, సైదులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం


విజేతలకు బహుమతులను అందజేసిన ఐలా చైర్మన్ రోషిరెడ్డి తదితరులు

కుషాయిగూడ: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఐలా చైర్మన్ రోషిరెడ్డి అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మే డే వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి ఆయన బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పనిఒత్తిడితో సతమతమయ్యే కార్మికులకు క్రీడాపోటీలు ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో చర్లపల్లి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బీవీ సత్యనారాయణ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, జి.శ్రీనివాసులు, కొండల్‌రెడ్డి, రసూల్, వెంకటేష్, మణికంఠ, బాలరాజ్, సంతోష్, సోమాచారి, నరసింహులు, సుభాష్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

అల్వాల్: రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మల్కాజిగిరి కోర్టు నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు న్యాయవాదుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపుతోందన్నారు. రాష్ట్రం ఏర్పాటు అనంతరం రాష్ట్రం అభివృద్ధి పథంలో పయణిస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు గొల్లూరి అంజయ్య, ప్రభుత్వ న్యాయవాదులు సందీప్‌గౌడ్, మంత్రి రవీందర్, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, తోట వెంకట్ ప్రసాద్, పెంచాల సురేందర్‌రావు, మల్కాజిగిరి బార్ అసోషియేషన్ అధ్యక్షులు రాంచంద్రారెడ్డి, మాజీ ప్రెసిడెంట్స్ కారంగుల యాదగిరిరావు, పుట్టపాక సుధీర్‌కుమార్, పబ్బ రమేష్, రవికాంత్‌గౌడ్, న్యాయవాదులు మేకల శ్రీనివాస్, మహ్మద్ ఖలీల్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించిన మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు డ్రగ్స్ ముఠాపై దాడులు నిర్వహించి ఒకరిని అదుపులోకి తీసుకుని 41గ్రాముల స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడేపల్లిగూడెంకు చెందిన పోతిరెడ్డి మెహర్ బాబా(35) నగరంలోని బేగంపేట్‌లో నివాసం ఉంటూ రెండేళ్లుగా డ్రగ్స్ వ్యాపారం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత సోమవారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి కిష్టాపూర్ గ్రామ పరిధిలో ప్రభుత్వ బాలికల గురుకుల సంక్షేమ పాఠశాల సమీపంలో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారంతో మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. నిందితుడి వద్ద నుంచి 41 గ్రాముల నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకుని మేడ్చల్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడికి డ్రగ్స్ సరఫరా చేస్తున్న మరో ఢిల్లీకి చెందిన జిన్ని పరారీలో ఉన్నాడని, డ్రగ్స్ విలువ రూ.38 లక్షలు ఉంటుందని తెలిపారు. డ్రగ్స్ విక్రయం, కొనుగోలు చేసే వారిపై పూర్తి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. డ్రగ్స్ పట్టుకున్న ఎస్ఓటీ కానిస్టేబుల్ దస్తప్ప, సిబ్బందిని ఆయన అభినందించారు. సమావేశంలో మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఓటీ సీఐ జేమ్స్‌బాబు, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా ఎల్లమ్మ కల్యాణం


ఉదయచందర్‌రెడ్డికి ఎల్లమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ధర్మకర్త ఈగ మధు

పోచారం: ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో ఎల్లమ్మ జాతర జరుగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం ఎల్లమ్మ అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, చామల ఫౌండేషన్ చైర్మన్ ఉదయ చందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయచందర్‌రెడ్డిని ఆలయ ధర్మకర్త ఈగ మధు ముదిరాజ్ శాలువాతో సత్కరించి, ఎల్లమ్మ తల్లి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల యువ నాయకుడు కొరిమిల ప్రదీప్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు రాము ముదిరాజ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## 23వ వార్డు అభివృద్ధికి కృషి


వార్డులో పర్యటిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మేడ్చల్: పట్టణంలోని 23వ వార్డు అభివృద్ధి కృషి చేస్తానని వార్డు కౌన్సిలర్ కౌడే మహేష్ కురమ అన్నారు. వార్డులో రూ.5 లక్షలతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీని ఆయన చైర్‌పర్సన్ దీపికనర్సింహరెడ్డితో కలిసి ప్రారంభించి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డును మున్సిపల్ నిధుల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. వార్డు మొత్తం మేడ్చల్ పాత ప్రాంతం కావడంతో మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని అన్నారు. వార్డులోని అన్ని వీధుల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎన్‌జీ గ్యాస్ లీకేజీ.. మరమ్మతులు చేసిన సిబ్బంది

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సీఎన్‌జీ గ్యాస్ పైప్ పగిలి లీకేజీకి గురయ్యింది. మున్సిపాలిటీ పరిధిలో ఆర్ అండ్ బీ శాఖ నాలా పనుల్లో భాగంగా జేసీబీ సాయంలో రోడ్డును తవ్వుతుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ పైప్‌లైన్ పగలడంతో ఒక్కసారిగా గ్యాస్ లీకైంది. గ్యాస్ బయటికి రావడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. సుమారు 20 నిమిషాల పాటు గ్యాస్ లీకయ్యింది. విషయం తెలుసుకున్న గ్యాస్ సిబ్బంది ఘటన స్థలికి చేరుకుని మరమ్మతులు చేసి లీకేజీని నియంత్రించారు. గ్యాస్ లీకైనా ప్రమాదం జరగదని గ్యాస్ సిబ్బంది తెలిపారు.


లీకవుతున్న గ్యాస్

## బస్తీ దవాఖానాకు శంకుస్థాపన


బస్తీ దవాఖానాకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సామల బుచ్చిరెడ్డి

బోడుప్పల్: అంబేడ్కర్‌నగర్‌లో నూతనంగా నిర్మించనున్న బస్తీ దవాఖానాకు మంగళవారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. త్వరితగతిన పూర్తిచేసి పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. అనంతరం రా చెరువును సందర్శించి సుందరీకరణ, సంరక్షణ గురించి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్, 12వ డివిజన్ ఇన్‌చార్జి చంటి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యం

గౌతంనగర్: ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రచార కార్యదర్శి జిల్లెల రవియాదవ్ అన్నారు. మంగళవారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్ 85, 8, 87 తదితర ప్రాంతాల్లో శక్తికేంద్రం ఇన్‌చార్జి బండారి రవి ఆధ్వర్యంలో దీవార్‌పే లిఖ్నా (గోడపై రాయడం) కార్యక్రమం నిర్వహించారు. జిల్లెల రవి యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామోజీ, సంతోష్‌కుమార్, లక్ష్మణ్, జ్యోతిబాయ్, లక్ష్మణ్, జెనిగ వెంకట్ యాదవ్, రాములు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

## జల్సాల కోసం చోరీల బాట

కుషాయిగూడ: జల్సాల కోసం దొంగతనం బాట పట్టారు ఇద్దరు మైనర్ బాలురు. రాత్రి వేళల్లో ఇళ్ల ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించి జల్సాలు చేయడం హాబీగా మార్చుకున్న వారు పోలీసులకు పట్టుబడ్డ ఘటన మంగళవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. కుషాయిగూడ ప్రాంతానికి చెందిన ఇద్దరు మైనర్ బాలురు మద్యం, సిగరెట్టు తాగడం వంటి చెడు వ్యసనాలకు బానిసయ్యారు. ఈ క్రమంలో వారిద్దరూ స్నేహితులుగా మారి చోరీల బాట పట్టారు. రాత్రి సమయంలో ఇళ్ల ముందు పార్కు చేసిన ద్విచక్రవాహనాలను దొంగిలించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో మంగళవారం చక్రిపురం చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి జువైనల్ హోంకు తరలించారు.

## సత్తాచాటిన గురుకుల కళాశాల విద్యార్థులు


వడల ఇంధు (రాష్ట్ర స్థాయి 7వ ర్యాంకు)


కె.దీక్షిత(466) ఎస్సార్ కాలేజీ


సాయి మాన్విత (983)


మౌనిక(982)


కీర్తనప్రణయ(988)


శ్రేయ (986)


గంగోత్రి(983)

కీసర: కీసరగుట్ట సమీపంలోని అశ్వీత ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న జ్యోతిబాపూలే బాలికల గురుకుల కళాశాల(చార్మినార్ నియోజకవర్గం)కు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 74 మంది పరీక్షలు రాయగా 55 మంది ఉత్తీర్ణత సాధించారని, 74.37 శాతం ఫలితాలు రాగా వడల ఇంధు ఎంపీసీలో 988 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకు సాధించింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో 69 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 55 మంది (79.7) శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

#### మలక్‌పేట నియోజకవర్గం..

మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన ఇంటర్ విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 80 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 71 మంది(88.75 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 74 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 64 మంది(86.4 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో వడల పద్మ 463 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు, అరుంధతీ 461 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు, పి.సాత్విక 460 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధించారు.

#### చీర్యాల ఎస్సార్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కీసర: చీర్యాల సమీపంలోని ఎస్సార్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. ఎంపీసీ విభాగంలో కె.దీక్షిత 470 మార్కులకు 466 మార్కులు, జి.పల్లవి 470 మార్కులకు 459 మార్కులు సాధించింది. బైపీసీలో జి.పూజ 440గాను 430 మార్కులు సాధించగా పి.నవ్య 440 మార్కులకు 328 మార్కులు సాధించిందని కళాశాల చైర్మన్ సంతోష్‌రెడ్డి తెలిపారు.

#### సత్తాచాటిన శ్రీచైతన్య, రుషి కళాశాల విద్యార్థులు

ఘట్‌కేసర్: ఐపీఈ 2022–23 విద్యాసంవత్సరం సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఘట్‌కేసర్ పట్టణంలోని శ్రీచైతన్య, రుషి బాలికల కళాశాల విద్యార్థులు మంగళవారం విడుదలైన ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించారు. సీనియర్ బైపీసీ విభాగంలో కీర్తన 988/1000 మార్కులు, శ్రేయ 986/100 మార్కులు, సీనియర్ ఎంపీసీలో సాయి మాన్విత 983/1000, మౌనిక 982/1000, ఎంఈసీలో గంగోత్రి 983/1000 మార్కులు సాధించారు. ఫలితాల విడుదల అనంతరం కళాశాల చైర్మన్ కె.పద్మారెడ్డి, ప్రిన్సిపాల్ పద్మారెడ్డి, డైరెక్టర్లు ఎస్.రవీందర్‌రెడ్డి, బాబులోరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో మిఠాయిలు పంచిపెట్టారు.